

షెరినా క్రిస్ట్‌కు అడ్మిషన్ పత్రాన్ని అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

కరోనా సహాయనిధికి విరాళమిచ్చిన

# విద్యార్థినికి బీఎస్సీ సీటు

## ఉత్తర్వులు అందించిన సీఎం

చెన్నై, మే 23 (ఆంధ్రజ్యోతి): కరోనా లాక్‌డౌన్ సమయంలో సెల్‌ఫోన్ కోసం పొదుపు చేసిన సొమ్మును కరోనా సహాయ నిధికి విరాళంగా ఇచ్చిన విద్యార్థిని ఉన్నత చదువులకు ముఖ్యమంత్రి స్టాలిన్ సాయం చేశారు. ఓ ప్రైవేటు కళాశాలలో బీఎస్సీ చదివేందుకు అడ్మిషన్ ఉత్తర్వులను అందించారు. పుదుకోట జిల్లా తేకాట్టూరులోని శ్రీలంక తమిళుల పునరావాస కేంద్రంలో ఉన్న సుచంద్ అజిత్‌కుమార్, మరియా క్రిష్టినా దంపతులకు షరీనా క్రిస్ట్, మెనిషా క్రిస్ట్ అనే ఇద్దరు కుమార్తెలున్నారు. వీరిద్దరు సెల్‌ఫోన్ కోసం పొదుపు చేసిన సొమ్మును ప్రభుత్వ కరోనా సహాయ నిధికి విరాళంగా అందజేశారు. ఈ విషయం గురించి తెలుసుకున్న మంత్రులు ఉదయనిధి, అన్బిల్ మహేష్ ఆ బాలికలకు ట్యాబ్‌లు కానుకగా ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇటీవల వెలువడిన ప్లస్-2 ఫలితాల్లో షెరినా క్రిస్ట్ 468 మార్కుల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది. ఈ విషయాన్ని ఆమె తండ్రి ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఓ లేఖలో తెలిపి తన కుమార్తెకు వైద్య సంబంధిత కోర్సుల్లో అడ్మిషన్ ఇప్పించి సాయపడాలని కోరారు. ఆ లేఖను పరిశీలించిన ముఖ్యమంత్రి స్టాలిన్ తన క్యాంపు కార్యాలయంలో కలుసుకోవాలని షెరినా క్రిస్ట్ సందేశం పంపారు. ఆ మేరకు గురువారం ఉదయం స్టాలిన్‌ను క్యాంపు కార్యాలయంలో షెరినా క్రిస్ట్, తన చెల్లెలితో పాటు కలుసుకుంది. ఆ సందర్భంగా షెరినా క్రిస్ట్‌కు కర్పగ వినాయగా వైద్య కళాశాలలో బీఎస్సీలో అడ్మిషన్ కల్పిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల నకలును అందజేశారు. దీంతో షెరినా క్రిస్ట్ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపింది. స్టాలిన్ ఆమెకు మాజీ సీఎం కరుణానిధి రచించిన తిరుక్కురళ్ పుస్తకాన్ని, విలువైన కలాన్ని కానుగా అందించారు.

## సిలందియారుపై చెక్‌డ్యామ్ పనులు ఆపండి

### కేరళ సీఎంకు స్టాలిన్ లేఖ

చెన్నై, మే 23 (ఆంధ్రజ్యోతి): కావేరి బేసిన్‌లో అమరావతికి ఉపనదిగా ఉన్న సిలందియారుకు అడ్డంగా చెక్‌డ్యామ్ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కేరళ ముఖ్యమంత్రి పినరాయ్ విజయన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్టాలిన్ గురువారం కేరళ ప్రభుత్వానికి లేఖ రాశారు. సిలందియారుపై చెక్‌డ్యామ్ నిర్మిస్తున్నట్లు సమాచారం తెలియగానే రైతులంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారని, చెక్‌డ్యామ్ నిర్మాణం పూర్తయితే అమరావతి వాగు నుండి సాగు జలాలు ఆగిపోయే అవకాశం ఉందని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చెక్ డ్యామ్ నిర్మాణానికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ వివరాలను తమకు అందించాలని, ఆపై న్యాయపరమైన అంశాలను పరిశీలిస్తామని అంతవరకు చెక్ డ్యామ్ నిర్మాణ పనులను ఆపివేయాలని కేరళ ముఖ్యమంత్రికి రాసిన లేఖలో ఆయన విజ్ఞప్తి చేశారు.

నేలబొగ్గు

# కొను 'గోల్‌మాల్!'

## రూ.6,000 కోట్లు హాంఫట్

### అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో భారీ అవినీతి



చెన్నై, మే 23 (ఆంధ్రజ్యోతి): గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో జరిగిన నేలబొగ్గు కొనుగోళ్లలో భారీ గోల్‌మాల్ నెలకొంది. ఓ సంస్థ నుంచి రాష్ట్ర విద్యుత్ బోర్డుకు నేలబొగ్గు తరలించడంలో రూ.6,000 కోట్ల మేర అవినీతి జరిగింది. 2012-2016 మధ్యకాలంలో జరిగిన నేలబొగ్గు దిగుమతుల్లో జరిగిన అవినీతి కారణంగా రాష్ట్ర విద్యుత్ బోర్డుకు సుమారు రూ.6 వేల కోట్లు నష్టం వాటిల్లిందంటూ ఓ తమిళ పత్రిక సంచలన కథనం ప్రచురించింది. ఆ కథనం మేరకు వివరాలిలా వున్నాయి... రాష్ట్ర విద్యుత్ బోర్డుకు అవసరమైన నేలబొగ్గు దిగుమతి చేసుకొనేందుకు, గౌతమ్ అదానీ సంస్థతో రాష్ట్రప్రభుత్వ ఒప్పందం చేసుకుంది. రాష్ట్రానికి అవసరమైన నేలబొగ్గును అధిక శాతం అదానీ సంస్థ నుంచే కొనుగోలు చేయడం గమనార్హం.

**నాణ్యత తక్కువ.. ధర ఎక్కువ!**

ఐరోపా దేశంలోని ఆమ్‌స్టర్ డ్యాం కేంద్రంగా పనిచేస్తున్న 'ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్' (ఓసీసీఆర్పీ) అనే సంస్థ ఈ అవినీతితో కూడిన వివరాలు సేకరించింది. బ్రిటీష్ పత్రిక 'ఫైనాన్సియల్ టైమ్స్' ఈ కథనాన్ని ప్రచురించింది. 2014లో ఇండోనేషియా నుంచి తమిళనాడు విద్యుత్ బోర్డు నేలబొగ్గు దిగుమతి చేసుకుంది. కిలో 6,000 క్యాలరీల ఉష్ణోగ్రత కలిగించే ఉన్నత రకం నేలబొగ్గు కోసం విద్యుత్ బోర్డు ఆర్డరు ఇచ్చింది. కానీ, సరఫరా చేసిన నేలబొగ్గు మాత్రం 3,500 క్యాలరీల ఉష్ణోగ్రత మాత్రమే కలిగించేదిగా ఉంది. ఇండోనేషియా నుంచి తక్కువ ధరకు తక్కువ నాణ్యత ఉన్న నేలబొగ్గు కొనుగోలు చేసిన సంస్థ.. ఆ బొగ్గు నాణ్యమైనదంటూ అధిక ధరకు విద్యుత్ బోర్డుకు విక్రయించింది. అలాగే, పలు దేశాల మీదుగా తీసుకొచ్చామంటూ రవాణా ఖర్చులు అధికంగా వసూలుచేసినట్లు తెలిసింది. అదే ఏడాది, ఇలాగే మరో 24 నౌకల ద్వారా నాణ్యత తక్కువైన నేలబొగ్గు దిగుమతయింది. ఈ తక్కువ నాణ్యత కలిగిన నేలబొగ్గు ఉన్నత రకంగా చూపించే సర్టిఫికెట్ కోసం అధికారులకు భారీగా లంచం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆ ప్రకారం, టన్ను రూ.2,300లకు కొనుగోలు చేసి విద్యుత్‌బోర్డుకు టన్ను రూ.7,650 చొప్పున కట్టబెట్టారు.

**కాలుష్యం ముప్పు!**

ఈ నాణ్యత లేని నేలబొగ్గు ద్వారా కాలుష్యం కూడా పెరిగినట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. తక్కువ నాణ్యతతో కూడుకున్న నేలబొగ్గు వినియోగించే సమయం కూడా అధికమైంది. అందువల్ల పొగ కూడా ఎక్కువగా రావడంతో పర్యావరణానికి హాని కలిగింది. దేశంలో 2022లో మాత్రమే 22 లక్షల మంది వాయుకాలుష్యం వల్ల మృతిచెందగా, లక్షల మంది అనారోగ్య సమస్యల బారినపడ్డారు. చెన్నైకి చెందిన ఓ సంస్థ 2018లో ఈ సమస్య వెలుగులోకి తీసుకురావడంతో పాటు రాష్ట్ర అవినీతి నిరోధక శాఖకు ఫిర్యాదు చేసింది. ఆ ప్రకారం, 2012-2016 కాలంలో నాణ్యత లేని నేలబొగ్గుతో తమిళనాడు విద్యుత్ బోర్డు రూ.6,000 కోట్ల నష్టం చవిచూసింది. 2017లో వెలువడిన 'కాగ్' నివేదికలో కూడా, నేలబొగ్గు దిగుమతుల్లో జరిగిన అవినీతి గురించి ప్రశ్నించింది. నేలబొగ్గు దిగుమతులకు సంబంధించిన టెండర్లలో కూడా అవినీతి జరిగిందని కాగ్ నిగ్గదీసింది. అధికారులు, రాజకీయ నేతల అండదండల వల్లే ఇంత భారీస్థాయిలో జరిగిన అవినీతి జరిగిందన్నది బహిరంగ రహస్యమే!

## చెన్నై విమానాశ్రయం ఏటీసీ టవర్‌లో అగ్నిప్రమాదం

పెరంబూర్, మే 23: చెన్నై విమానాశ్రయ కంట్రోల్ రూమ్ ఉన్న ఏటీసీ టవర్‌లో గురువారం వేకువజామున అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు సత్వరం ఆర్పడంతో, విమానాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలుగలేదు. అయినా, ఏటీసీ టవర్‌లో సంభవించిన అగ్నిప్రమాదంపై విమానాశ్రయ ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నారు. చెన్నై విమానాశ్రయంలో స్వదేశీ, అంతర్జాతీయ విమానసేవలు క్రమబద్ధీకరించేలే 'ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) టవర్‌లో కంట్రోల్ రూం పనిచేస్తుంది. చెన్నై విమానాశ్రయం నుంచి బయల్దేరే విమానాలు, ల్యాండింగ్ అయ్యే విమానాలు, ల్యాండింగ్ కాకుండా ఆకాశంలో ఉన్న విమానాలు అని అన్నిరకాల విమాన సేవలు పర్యవేక్షించే ప్రధానమైన, భద్రతా ప్రమాణాలు కలిగిన ప్రాంతంగా ఏటీసీ టవర్ పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో, ఏటీసీ టవర్ నాలుగో అంతస్తులో బాల్కనీ ప్రాంతంలోని ఓ గదిలో గురువారం వేకువజామున 3.30 గంటలకు హఠాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన కంట్రోల్ రూమ్ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో విమానాశ్రయ అగ్నిమాపక కార్యాలయం నుంచి మూడు వాహనాలతో అక్కడకు చేరుకున్న సిబ్బంది సుమారు 20 నిమిషాలు శ్రమించి మంటలు అదుపుచేశారు. ఏటీసీ టవర్ 4వ అంతస్తులోని బాల్కనీలో ఉన్న ఓ గదిలో అవసరమైన వస్తువులు వేశారని, ఆ గదిలో ఏర్పడిన మంటలతో ఈ ప్రమాదం జరిగిందని సమాచారం. కాగా, అత్యంత భద్రత కలిగిన ఈ ప్రాంతంలో మంటలు చెలరేగడంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించినట్లు సమాచారం.

తుఫానుగా మారనున్న

# వాయుగుండం

**నేడు 8 జిల్లాలకు భారీ వర్షసూచన**

చెన్నై, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్రను ఆనుకుని నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో బుధవారం ఏర్పడిన అల్పపీడనం ఈశాన్య దిశగా కదులుతూ మరింత బలపడినట్లు వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. శుక్రవారం ఈ అల్పపీడనం వాయుగుండంగా మారుతుందని, ఆ తర్వాత ఈ నెల 25న తుఫానుగా మారి ఈశాన్యదిశగా కదలి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో శుక్రవారం భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం, ఉపరితల ఆవర్తనం కారణంగా ఈ నెల 28 వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలు, పుదుచ్చేరి తదితర ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయన్నారు. గురువారం మధ్యాహ్నం తేని, తెన్‌కాశి, తిరునల్వేలి, కన్నియాకుమారి, తూత్తుకుడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. ఇదే విధంగా శుక్రవారం నీలగిరి, కోయంబత్తూరు, తిరుప్పూరు, దిండుగల్, తేని, తెన్‌కాశి, తిరునల్వేలి, కన్నియాకుమారి జిల్లాల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. చెన్నై నగరానికి సంబంధించినంతవరకు శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుందని, కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురుస్తాయని తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, వాయుగుండగంగా ఉత్తర దిశగా కదలి పశ్చిమబెంగాల్ - బంగ్లాదేశ్ నడుమ తీరం దాటే అవకాశాలుండటంతో సముద్రతీర ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రత క్రమంగా అధికమయ్యే సూచనలు కూడా ఉన్నాయని వివరించారు. శుక్రవారం కన్నియాకుమారి, మన్నార్ జలసంధి సహా దక్షిణ బంగాళాఖాతం తీర ప్రాంతాల్లో గంటలకు 55 నుండి 65 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని, జాలర్లు చేపలవేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరిక జారీ చేశారు.



కన్నియాకుమారిలో కూలిపడిన చెట్టు తొలగిస్తున్న కార్మికులు

**కుమరిలో కుండపోత...**

కన్నియాకుమారిలో బుధవారం రాత్రి పది గంటల నుంచి గురువారం ఉదయం ఆరుగంటల వరకు కుండపోతగా వర్షాలు కురిశాయి. కన్నియాకుమారి, మయిలాడి, సామితోప్పు, అంజుగ్రామం తదితర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ దీవులుగా మారాయి. ఇదే విధంగా నాగర్‌కోవిల్‌లోనూ గురువారం వేకువజాము చెదురుముదురుగా వర్షాలు కురిశాయి.

**ఇల్లుకూలి ఒకరి మృతి...**

సేలం అన్నదానపట్టి కన్నగి వీధిలో ఓ ఇల్లు కూలిపడి సెంతమిళ్ (50) అనే ప్లాస్టిక్ కంపెనీ కార్మికుడు దుర్మరణం చెందారు. బుధవారం రాత్రి ఆ ప్రాంతంలో భారీగా వర్షాలు కురిశాయి. దీంతో హాలో బ్లాక్‌లతో నిర్మించిన సెంతమిళ్ ఇల్లు గురువారం వేకువజాము ఉన్నట్టుండి కూలిపోవడంతో నిద్రపోతున్న సెంతమిళ్ తీవ్రంగా గాయపడి దుర్మరణం చెందారు.

# అయోధ్యలో సీతమ్మకు ఆలయం

## కమలాలయంలో బీఫ్ విందు ఏర్పాటుచేస్తే పాల్గొంటాం

### కాంగ్రెస్ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్

ప్యారీస్, మే 23: లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో మెజార్టీ విజయం సాధించి 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే అయోధ్య నగరాన్ని మరింత అభివృద్ధి పరచడంతో పాటు సీతమ్మవారికి కూడా ఆలయం నిర్మిస్తామని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ పేర్కొన్నారు. రాయపేటలోని కాంగ్రెస్ కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో దివంగత టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు పి.రామచంద్రన్ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈవీకేఎస్ మీడియాతో మాట్లాడుతూ... ప్రధాని మోదీ తన పుట్టుక గురించి ప్రజలను తప్పుదారి పట్టించేలా అవాస్తవాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. నాశిరకం బొగ్గును తమిళనాడుకు సరఫరా చేసి సుమారు రూ.6,000 కోట్ల మోసానికి కేంద్రం పాల్పడిందని, ఈ వ్యవహారంలో ప్రధాని నరేంద్ర మోదీ హస్తం కూడా ఉందని, అతడిని విచారించాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నగరంలోని ఆ పార్టీ కార్యాలయం కమలాలయంలో బీఫ్ విందు ఏర్పాటుచేస్తే తమ పార్టీ శ్రేణులంతా సంతోషంగా పాల్గొంటామని తెలిపారు. ఒడిశా పూరి జగన్నాథ ఆలయ భాండాగారం తాళం చెవులు తమిళనాడులో ఉన్నట్లు వ్యాఖ్యానించిన ప్రధాని మోదీ, తమిళులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై డిమాండ్ చేయడంలో తప్పులేదన్నారు. తమను కమలాలయానికి ఆహ్వానించిన అన్నామలై ఏర్పాటుచేసే విందులో తప్పనిసరిగా పశుమాంసం ఉండాలని కోరారు. డీఎంకే-కాంగ్రెస్ పార్టీలు ఒకే కూటమిలో ఉన్నాయని, మతశక్తులను తరిమివేసి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్న ఉద్దేశంతోనే తాము కలిసి పోరాడుతున్నట్లు తెలిపారు. కామరాజర్ లాగే ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా ప్రజలకు మంచి పాలన అందిస్తున్నారని కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు రంగభాష్యం, ఎస్‌ఏ వాసు, ఏజీ చిదంబరం తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రన్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



చెన్నైకి 'డోర్నియర్ 228'

# ఎయిర్‌క్రాఫ్ట్

పెరంబూర్, మే 23: భారత తీరప్రాంత భద్రతా దళానికి అందజేసిన అధునాతన 'డోర్నియర్ 228' రక విమానాలు బుధవారం చెన్నై చేరుకున్నాయి. చెన్నై కేంద్రంగా నడుపనున్న ఈ విమానాలు తమిళనాడు, ఆంధ్ర, పుదుచ్చేరి సముద్రతీర సరిహద్దు ప్రాంతాల్లో గస్తీ చేపట్టనున్నాయి. కాన్పూర్‌లోని హిందుస్తాన్ ఏరోనాటికల్స్ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ అధునాతన విమానాలు రూపొందించింది. ఈ విమానాల్లో మెరుగైన సాంకేతిక పరిజ్ఞానం, ఐదు బ్లేడెడ్ ప్రొపెల్లర్, గ్లాస్ కాక్‌పిట్, 12.7 ఎంఎం ఏవీ గన్, శాటిలైట్ కమ్యూనికేషన్ సిస్టమ్ ఉన్నాయి. 'మేక్ ఇన్ ఇండియా' చొరవతో 'ఆత్మనిర్భర్ భారత్'లో భారత తీర రక్షక దళానికి ఈ విమానాలు అందజేశారు. బుధవారం నగరానికి చేరుకున్న రెండు విమానాలపై నీరు చల్లుతూ అధికారులు ఆహ్వానించారు.

ముల్లై పెరియార్ డ్యాం కూల్చేందుకు

# అనుమతివ్వండి

- కేంద్రానికి కేరళ ప్రభుత్వం లేఖ
- రాష్ట్ర కాంగ్రెస్ ఖండన

ప్యారీస్, మే 23: పాతబడిన ముల్లైపెరియార్ డ్యాంను కూల్చివేసేందుకు అనుమతించాలని, దానికి బదులుగా కొత్త డ్యాం తామే నిర్మించుకుంటామని కేంద్ర ప్రభుత్వానికి కేరళ ప్రభుత్వం లేఖ రాసిన వ్యవహారం కొత్త వివాదానికి దారితీసింది. కేరళ ప్రభుత్వ వైఖరిని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సెల్వపెరుందగై ఖండిస్తూ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేరళ రాష్ట్రం ఇడిక్కి జిల్లాలో ముల్లైపెరియార్ నదిపై డ్యాం నిర్మించారు.. ఆంగ్లేయుల పాలనలో ముల్లైపెరియార్ నీటిని కేరళ, తమిళనాడు రాష్ట్రాలు సమానంగా పంచుకోవాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన ఒప్పందం అప్పటి మద్రాసు ప్రిసీడియం ప్రభుత్వానికి, తిరువిదాంకూర్ రాజుల మధ్య 1886లో జరిగింది. ఇందులో 999 సంవత్సరాలకు జలాల పంపిణీపై ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం, మద్రాసు ప్రిసీడియం ప్రభుత్వం తరఫున ముల్లైపెరియార్ ప్రాంతంలో నిర్మించిన డ్యాం పూర్తి హక్కులు రాష్ట్రానికే చెందాయి. అయితే లీజుకు సంబంధించిన పన్ను మాత్రం కేరళకు చెందుతుందని ఒప్పందంలో స్పష్టంగా తెలిపారు. 155 అడుగుల ముల్లైపెరియార్ డ్యాంలో 152 అడుగుల వరకు నీరుంచి వైగై డ్యాంకు విడుదల చేసి అక్కడి నుంచి మదురై, రామనాథపురం, శివగంగ జిల్లాలకు సాగునీరుగా సరఫరా చేస్తారు.. ఈ నేపథ్యంలో, ఆంగ్లేయుల పాలనలో 128 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ డ్యాం శిథిలావస్థకు చేరుకుందని, డ్యాం కూల్చివేసి కొత్త డ్యాం తామే నిర్మించుకొనేందుకు అనుమతించాలని కోరుతూ కేరళ ప్రభుత్వం కేంద్రప్రభుత్వానికి లేఖ రాసింది. జనవరి నెలలో రాసిన ఈ లేఖ వ్యవహారం ప్రస్తుతం ఆలస్యంగా వెలుగు చూసింది. దీనిపై రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సెల్వపెరుందగై సహా పలువురు నేతలు కేరళ ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టారు.

# పాఠ్యపుస్తకాలు సిద్ధం

## ఈ నెలాఖరులోగా పాఠశాలలకు తరలింపు

పెరంబూర్, మే 23: ఒకటో తరగతి నుంచి ప్లస్ టూ వరకు విద్యార్థులకు అందించేందుకు తమిళనాడు టెక్స్ట్ బుక్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటికే ముద్రించిన పాఠ్యపుస్తకాలు ఈ నెలాఖరులోగా పాఠశాలలకు పంపించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో వేసవి సెలవుల అనంతరం జూన్‌లో పాఠశాలలు ప్రారంభించనున్న నేపథ్యంలో, 1 నుంచి ప్లస్ టూ తరగతి వరకు పాఠ్య పుస్తకాల ముద్రణ పూర్తయి ఆయా జిల్లాల్లోని గోదాములకు తరలించారు. అలాగే, తమిళనాడు ఖాదీ బోర్డు ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు కూడా పంపించారు. జిల్లాలకు తరలించిన పాఠ్య, నోటు పుస్తకాలను ఈ నెలాఖరులోగా అన్ని పాఠశాలలకు తరలించి, పాఠశాలలు ప్రారంభించిన రోజే విద్యార్థులకు అందజేయాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ విషయమై పాఠశాల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ... రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో 1 నుంచి ప్లస్ టూ వరకు విద్యార్థులకు ఉచితంగా అందించేందుకు 2.68 కోట్ల పాఠ్యపుస్తకాలు, విక్రయించేందుకు మరో 1.31 కోట్ల పుస్తకాల చొప్పున మొత్తం 4 కోట్ల పుస్తకాలు ముద్రించామన్నారు. పాఠశాలలు ప్రారంభించిన తర్వాత 1 నుంచి 7వ తరగతి విద్యార్థుల వరకు మొదటి సెమిస్టర్ పుస్తకాలు, 8 నుంచి ప్లస్ టూ వరకు అన్ని పాఠ్యపుస్తకాలు అందించనున్నామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలకు తరలించిన ఈ పాఠ్య, నోటు పుస్తకాలను పాఠశాలలకు తరలిస్తున్నామన్నారు. వేసవి సెలవుల తరువాత పాఠశాలల ప్రారంభంపై ప్రభుత్వం త్వరలో ప్రకటిస్తుందని వారు పేర్కొన్నారు.



పాఠ్య పుస్తకాలు పరిశీలిస్తున్న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఎస్.కన్నప్పన్

## సమాచార దృష్టి

### 27 నుంచి రైళ్లలో ప్రత్యేక తనిఖీలు

ఐసిఎఫ్, మే 23: ఎక్స్‌ప్రెస్ రైళ్లలో దివ్యాంగుల కోచ్‌ల్లో ఇతర ప్రయాణికులు కూర్చోకుండా అడ్డుకునేందుకు ఈ నెల 27 నుంచి జూన్ 7వ తేది వరకు ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని అధికారులకు రైల్వే బోర్డు ఉత్తర్వులు జారీచేసింది. రైళ్లలోని దివ్యాంగులకు, మహిళలకు కేటాయించిన జనరల్ బోగీలో ఇతర ప్రయాణికులు ఎక్కి సీట్లు ఆక్రమిస్తున్నట్లు ఫిర్యాదులందుతున్నాయి. దీనిపై స్పందించిన రైల్వే బోర్డు ప్రత్యేక తనిఖీలకు ఉత్తర్వులు జారీచేసింది.

### నేడు చెన్నై బీచ్-చెంగల్పట్టు సబర్బన్ రైళ్లు పాక్షిక రద్దు

పెరంబూర్, మే 23: చెంగల్పట్టు యార్డ్ ప్రాంతంలో మరమ్మతుల కారణంగాచెన్నై బీచ్ నుంచి చెంగల్పట్టు వెళ్లే సబర్బన్ రైళ్లు శుక్రవారం పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, చెన్నై బీచ్ నుంచి ఉదయం 9.30, 10.56, 11.40, మధ్యాహ్నం 12.40 గంటలకు చెంగల్పట్టు వెళ్లే సబర్బన్ రైళ్లు శంకరన్ కోయిల్ వరకు మాత్రమే నడుస్తాయి. అలాగే, చెంగల్పట్టు నుంచి ఉదయం 11.30, మధ్యాహ్నం 1, 1.45, 3.05 గంటలకు చెన్నై బీచ్ వెళ్లే రైళ్లు చెంగల్పట్టుకు బదులుగా శంకరన్‌కోయిల్ నుంచి బయల్దేరనున్నాయి.

### 27న ర్యాంకుల జాబితా విడుదల

ఐసిఎఫ్, మే 23: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలల ర్యాంకుల జాబితా ఈ నెల 27న విడుదల కానుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు స్వీకరణ గురువారంతో ముగిసింది. ఇదివరకే ఈ నెల 20వ తేది గడువు ముగియగా మరో నాలుగు రోజులు పొడిగించారు. ఈనెల 27వతేదిర్యాంకుల జాబితా విడుదల కానుండగా, తొలివిడత కౌన్సెలింగ్ జూన్ 10 నుంచి 15వ తేది వరకు, రెండో విడత 24 నుంచి 29వ తేది వరకు జరగనుంది. మొదటి సంవత్సరం విద్యార్థులకు జూలై 3 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని కళాశాల విద్య డైరెక్టరేట్ తెలిపింది.

### సంఘ సేవకులకు పురస్కారాలు

ఐసిఎఫ్, మే 23: మహిళల అభివృద్ధికి కృషిచేసిన సంఘసేవకులు, స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వం పురస్కారాలు అందజేయనుంది. ఉత్తమ సంఘ సేవకులకు రూ.50వేల నగదు, సర్టిఫికెట్, ఉత్తమ స్వచ్ఛంద సంస్థకు రూ.లక్ష, సర్టిఫికెట్ ఇవ్వనున్నారు. ఆగస్టులో స్వాతంత్ర్య దినోత్సవం రోజున సీఎం అందజేసే ఈ పురస్కారానికి ఆసక్తి ఉన్నవారు https://awards.tn.gov.in ద్వారా జూన్ 20వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

### బీఎస్సీ నర్సింగ్, బిఫార్మ్ కోర్సుల్లో ప్రవేశాలు

పెరంబూర్, మే 23: బీఎస్సీ నర్సింగ్, బిఫార్మ్ సహా 19 అనుబంధ వైద్య కోర్సులకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి జూన్ 21వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలి. మరిన్ని వివరాలకు www.tnmedicalselection.net అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

### 26న సంకటహర చతుర్థి

ప్యారీస్, మే 23: తిరువళ్లూర్ సమీపంలోని కాకలూరు మారుతి న్యూ టౌన్‌లో ఉన్న సెల్వగణపతి దేవాలయం-శ్రీరాములవారి సన్నిధిలో ఈనెల 26న సంకటహర చతుర్థి, సంవత్సరాభిషేకం జరగనున్నాయి. 2023మేలో ఈఆలయ సంప్రోక్షణ, మహా కుంభాభిషేకం జరిగిన సందర్భంగా తొలివార్షికోత్సవానికి భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఆదివారం ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజ, గోపూజ, కలశ స్థాపన, 108 శంఖాల పూజ, మూలమంత్ర హోమం, కలశాభిషేకం, మహా దీపారాధన, మధ్యాహ్నం అన్నప్రసాదాల వితరణ, సాయంత్రం సంకటహర చతుర్థి పూజలు జరుగనున్నాయి. భక్తులు ఈ పూజల్లో పాల్గొనాల్సిందిగా ఆలయ నిర్మాణకర్త వి.శ్రీమన్నారాయణ, కమిటీ నిర్వాహకులు పిలుపునిచ్చారు.

### 22 నాణ్యత లేని మందులు

ఐసిఎఫ్, మే 23: మందుల తయారీ కంపెనీలు, విక్రయ దుకాణాల్లో జరిపిన తనిఖీల్లో 22 మందులు నాణ్యత లేనివిగా గుర్తించినట్లు కేంద్ర మందుల నాణ్యత నిర్ధారణ, ధరల నియంత్రణ బోర్డు అధికారులు తెలిపారు. వాటిలో 5 మందులు నకిలీవని గుర్తించామన్నారు. ఈ మందులు గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో తయారైనవన్నారు. ఏప్రిల్‌లో 1,000 మందుల నమూనాలు పరీక్షించగా, వాటిలో జ్వరం, జీర్ణకోశ సంబంధిత సమస్యలు వంటి 17 రకాల మందులు నాణ్యత లేనివని గుర్తించామన్నారు. అలాగే, బీపీ, బాక్టీరియా ఇన్‌ఫెక్షన్‌కు వినియోగించే 5 రకాల మందులు నకిలీ వని తెలిసాయని అధికారులు తెలిపారు.

### పాలిటెక్నిక్ కళాశాలల్లో కొత్త కోర్సులు

ఐసిఎఫ్, మే 23: ఈ విద్యా సంవత్సరం పాలిటెక్నిక్ కళాశాలల్లో కొత్త కోర్సులు పరిచయం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు మొత్తం 490 ఉన్నాయి. వీటిలో మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ ఇంజనీరింగ్ వంటి కోర్సులు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో, కర్మాగారాలతో కలసి వాణిజ్య సంస్థల అవసరాలను బట్టి ఉపాధినిచ్చే కొత్త కోర్సులను పరిచయం చేశారు. చెన్నై, కోయంబత్తూర్‌లో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో నేత సాంకేతికం, కోయబత్తూర్‌లోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమో కంప్యూటర్ ఇంజనీరింగ్, విల్లుపురం పాలిటెక్నిక్ కళాశాలలో ఆటోమొబైల్ ఇంజనీరింగ్ కోర్సులు పరిచయం చేశారు.

### ఐపిఎల్ అభిమానులకు ఉచిత ప్రయాణం లేదు

పెరంబూర్, మే 23: ఐపిఎల్ పోటీలకు వెళ్లే అభిమానులు తప్పకుండా టిక్కెట్లు తీసుకోవాలని మెట్రోట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) తెలియజేసింది. చేపాక్కంలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో ఐపిఎల్ క్రికెట్ పోటీల్లో భాగంగా శుక్రవారం ప్లే ఆఫ్, ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరుగనున్నాయి. గతంలో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి స్టేడియానికి వెళ్లేందుకు వారి ఐపిఎల్ టిక్కెట్లు చూపించి ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని ఎంటీసీ కల్పించింది. ఈనేపథ్యంలో, శుక్రవారం, ఆదివారం జరిగే మ్యాచ్‌లకు వెళ్లే అభిమానులు ఐపిఎల్ టిక్కెట్లు ఉన్నా, చార్జీ చెల్లించి ప్రయాణించాలని ఎంటీసీ తెలిపింది.

### రేపటి నుంచి ఓట్ల లెక్కింపు సిబ్బందికి శిక్షణ

పెరంబూర్, మే 23: ఓట్ల లెక్కింపు చేపట్టనున్న ఉద్యోగులకు ఈ నెల 25వ తేది నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలిపింది. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ గత నెల 19వ తేది ఒకే విడతలో ముగిసింది. ఈ ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలు, తపాలా ఓట్లు ఆయా లెక్కింపు కేంద్రాలకు తరలించి, మూడంచెల భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఉంచారు. ఓట్ల లెక్కింపులో సుమారు లక్ష మంది ఉద్యోగులు పాల్గొననున్నారు. అలాగే, ఎన్నికల పరిశీలకులు, ఓట్ల లెక్కింపు కేంద్రాల సూపర్‌వైజర్లు కూడా నియమితులయ్యారు. లెక్కింపులో పాల్గొనే సిబ్బందికి శనివారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ఆయా జిల్లాల్లోని పరిస్థితులకు అనుగుణంగా తరగతులు ఏర్పాటు చేయాలని ఎన్నికల అధికారులకు సూచించిన ఎన్నికలసంఘం, ఈశిక్షణ వచ్చేవారం చివరకు పూర్తిచేయాలని ఉత్తర్వులు జారీచేసింది.

# సమైక్యతకు ప్రతీక బుద్ధ జయంతి

**● నగరంలో కోలాహలంగా వేడుకలు**

ప్యారీస్, మే 23: 'మనిషి మనిషిగా గౌరవించాలి, సమస్త జీవులు, ప్రకృతిని ప్రేమించాలి, హింసా, విధ్వంసాలకు దూరంగా ఉండాలి' అని ప్రపంచాన్ని పంచసూత్రాలు అందించిన గౌతమ బుద్ధుడి జయంతి వేడుకలను సమైక్యతకు ప్రతీకగా గురువారం నగరంలో జరుపుకున్నారు. సిద్ధార్థుడు జన్మించిన, జ్ఞానం కలిగిన పవిత్రమైన ఈ రోజును బుద్ధ పూర్ణిమగా వాడవాడలా జరుపుకున్నారు. సిద్ధార్థుడి సిద్ధాంతాలు పాటిస్తున్న బుద్ధిస్టులు బౌద్ధ మందిరాలకు వెళ్లి ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ప్రార్థించారు. పెరంబూర్‌లోని దక్షిణ భారత బుద్ధ విహార్‌లో బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ నేతృత్వంలో పొర్కొడి, బౌద్ధ పెరుమాళ్, ఇడుంబన్, మణివన్నన్ తదితరుల పర్యవేక్షణలో వేడుకలు జరిగాయి. పెరంబూర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న డా.అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం బౌద్ధ విహార్‌లో సిద్ధార్థుడి ప్రతిమ ముందు ప్రత్యేకప్రార్థనలు నిర్వహించి, 1,000మందికిపైగా అన్నదానం చేశారు.


బుద్ధజయంతి వేడుకల్లో నిర్వాహకులు

### 15 ఇంజనీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్లు లేవు

ఐసిఎఫ్, మే 23: ఈ ఏడాది 15 ఇంజనీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్లు లేవని అన్నా విశ్వవిద్యాలయ ఉపకులపతి వేల్‌రాజ్ తెలిపారు. అన్నా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 450కి పైగా ఇంజనీరింగ్ కళాశాలలున్నాయి. 2024-25 విద్యా సంవత్సరం అడ్మిషన్లకు ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు ఈ నెల 6 నుంచి జరుగుతోంది. ఈ నేపథ్యంలో, 15 కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్లు జరగవని వీసీ వేల్‌రాజ్ తెలిపారు. ప్రస్తుతం ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై విద్యార్థులకు ఆసక్తి పెరిగిందని, ఈ కారణంగా విద్యార్థులు ఆ పాఠ్యాంశాలు, కంప్యూటర్ సైన్స్ ఎంపిక చేసుకుంటున్నారని తెలిపారు. గత ఏడాది మొదటి సంవత్సరం విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న 11 కళాశాలలకు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు అనుమతివ్వలేదని తెలిపారు. అలాగే, మరో నాలుగు కళాశాలల్లో కూడా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో వాటితో కలిపి మొత్తం 15 ఇంజనీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్లు నిలిపివేసినట్లు వీసీ తెలిపారు.

### ఘనంగా బాలమురుగన్ ఆలయ రథోత్సవం

వేలూరు, మే 23: స్థానిక రత్నగిరి బాలమురుగన్ ఆలయంలో వైకాశి విశాఖ బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో ప్రధానమైన రథోత్సవాన్ని ఆలయ పారంపర్య ట్రస్టీ బాలమురుగన్ అడిమై స్వామి ప్రారంభించారు. కొండను చుట్టి రథం వచ్చింది. రథంలో విశేష అలంకరణలో వల్లి, దేవయాని సమేత సుబ్రమణ్యస్వామి ఉత్సవమూర్తులు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులు రథం లాగి మొక్కులు తీర్చుకున్నారు. వేడుకల ఏర్పాట్లను ఆలయ నిర్వహణ అధికారి శంకర్, ఉద్యోగులు చేపట్టారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

### సింహ వాహనంపై ఊరేగింపు

ప్యారీస్, మే 23: స్థానిక పార్క్ టౌన్ కొండితోపు సమీపంలోని ముల్లా వీధిలో ఉన్న రంగనాథ స్వామి ఆలయంలో వైకాశి ఉత్సవాల్లో భాగంగా నృసింహస్వామి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నరసింహస్వామి ఉత్సవమూర్తిని సింహ వాహనంపై ఆశీనులు గావించి భక్తులు పాల్గొని గోవింద నామస్మరణలతో రథాన్ని లాగారు. ఈ సందర్భంగా రంగనాథుడు, రామచంద్రుడు, నరసింహస్వామివార్లకు ప్రత్యేక తిరుమంజనం, అలంకార పూజలను ఆలయ ధర్మకర్త హరికుమార్ నిర్వహించారు.


పురవీధుల్లో విహరిస్తున్న నృసింహస్వామి

### దొట్టబెట్ట శిఖరానికి పర్యాటకుల అనుమతి

పెరంబూర్, మే 23: ఊటీ దొట్టబెట్ట శిఖరానికి గురవారం నుంచి పర్యాటకులను అనుమతించారు. నీలగిరి జిల్లా ఊటీ-కోతగిరి రోడ్డులో సుమారు 8 కి.మీ దూరంలో ఉన్న దొడ్డబెట్ట శిఖరం రాష్ట్రంలోని ఎత్తైన శిఖరాల్లో ఒకటిగా పేరొందింది. దొడ్డబెట్ట శిఖరానికి వెళ్లేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతారు. ఈ శిఖరానికి వెళ్లాలంటే కోతగిరి రోడ్డు నుంచి 3 కి.మీ అటవీ మార్గంలో ప్రయాణించాల్సి ఉంది. ఈ మార్గం ప్రవేశద్వారంలో అటవీశాఖ టోల్‌గేట్ ఏర్పాటుచేసి ప్రవేశ రుసుము వసూలుచేస్తున్నారు. ఈ టోల్‌గేట్‌లో ఫాస్టాగ్ రూపంలో ప్రవేశరుసుము వసూలుచేసే విధానం అమలుచేస్తున్నారు. అందువల్ల టోల్‌గేట్‌లో చేపట్టిన సాంకేతిక పనుల కారణంగా వారంరోజులుగా పర్యాటకులకు నిషేధం విధించారు. పనులు పూర్తికావడంతో గురువారం నుంచి పర్యాటకులను అనుమతించినట్లు అటవీశాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

### టీ మాస్టర్ నిజాయితీ

వేలూరు, మే 23: రోడ్డుపై దొరికిన సెల్‌ఫోన్‌ను టీ దుకాణం యజమాని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. గుడియాత్తం బస్టాండ్ సమీపంలోని దుకాణంలో టీ మాస్టర్‌గా గుడియాత్తం కాలియమ్మన్‌పట్టికి చెందిన కుప్పన్ పనిచేస్తున్నాడు. కుప్పన్ దుకాణం సమీపంలోని రోడ్డుపై సెల్‌ఫోన్ పడి ఉండడం గమనించి, దానిని తీసుకొని గుడియాత్తం పోలీస్ ఇన్‌స్పెక్టర్ పార్థసారథికి అందించారు. టీ మాస్టర్ కుప్పన్ నిజాయితీని అభినందించిన సీఐ అతడిని శాలువాతో సత్కరించారు.


కుప్పన్‌ను సత్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ పార్థసారథి

### కర్రసాము విజేతలకు బహుమతి ప్రదానం

వేలూరు, మే 23: స్థానిక శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాలల్లో కర్రసాము సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కర్రసాము పోటీలు నిర్వహించారు. ఒకటి, రెండు కర్రల విన్యాసాల పోటీల్లో సుమారు 350 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా సెక్రటరీ సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సెల్వరాజ్, బీజేపీ మీడియా విభాగం అధ్యక్షుడు వెంకటేశన్,రాముదేవర్,కరాటే శక్తివులు, షణ్ముగం, మునుస్వామి, సురేష్‌బాబు, అబ్దుల్ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలతో అతిథులు, నిర్వాహకులు

### సమస్యలు తీర్చాలంటూ వినతి

వేలూరు, మే 23: గ్రామంలో నెలకొన్న సమస్యలు తీర్చాలంటూ కదిర్‌కులం గ్రామస్తులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. గుడియాత్తం తహసీల్దార్ సుబ్బులక్ష్మిని గురువారం కలిసిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు దళిత్‌కుమార్, కల్లపాడి పంచాయతి కదిర్‌కులమ్ పాల ఉత్పత్తిదారుల సంఘం మహిళా కార్యదర్శి భువనేశ్వరి నేతృత్వంలో గ్రామస్తులు కలుసుకున్నారు. కదిర్‌కులం గ్రామంలో సుమారు 350 కుటుంబాలుండగా, గ్రామానికి సరైన రోడ్డు, బస్సు సౌకర్యం లేదన్నారు. అలాగే, రేషన్‌దుకాణానికి వెళ్లాలంటే ఒకటిన్నర కి.మీ దూరంలో ప్రాంతానికి వెళ్లి సరుకులు తీసుకోవాల్సి వస్తుందన్నారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి కూడా అధికంగా ఉందని, ఈ సమస్యలు తీర్చాలని తహసీల్దార్‌కు గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.


తహసీల్దార్ సుబ్బులక్ష్మికి వినతిపత్రం సమర్పిస్తున్న దళిత్‌కుమార్, భువనేశ్వరి

### డ్రా పద్ధతిలో ఓట్ల లెక్కింపు ఉద్యోగుల ఎంపిక


ఉద్యోగులను ఎంపిక చేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మే 23: వేలూరు పార్లమెంటు నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కోసం మైక్రో సూపర్‌వైజర్లు, ఓటు లెక్కింపు సూపర్‌వైజర్లు, ఓట్ల లెక్కింపు అసిస్టెంట్లను కంప్యూటర్ ద్వారా డ్రా పద్ధతిలో ఎంపిక చేశారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎన్నికలఅధికారి, కలెక్టర్ సుబ్బులక్ష్మి డ్రా పద్ధతిలో ఉద్యోగులకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో అదనపు ఎన్నికల అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, జిల్లా కలెక్టర్ పీఏ సెల్వరాజ్, కేవీ కుప్పం ఎన్నికల అధికారి సుమతి, జిల్లా ఆదిద్రావిడుల సంక్షేమ అధికారి రామచంద్రన్, ఎన్నికల తహసీల్దార్ సత్యమూర్తి తదితరులున్నారు.

### కొబ్బరి చిప్పల లారీ దగ్ధం: రూ.14 లక్షల ఆస్తినష్టం

చెన్నై, మే 23 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా గాంగేయం వద్ద కొబ్బరి చిప్పల లోడుతో వెళుతున్న లారీ దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.14లక్షల మేరకు ఆస్తినష్టం జరిగింది. సివియర్‌పాళయంలో సదాశివం అనే వ్యక్తి ఎండు కొబ్బరి ఎగుమతి వ్యాపారం చేస్తున్నారు. గురువారం ఉదయం ఆయన 15 టన్నుల కొబ్బరి చిప్పల బస్తాలను లారీలో ఎక్కించి దానిని బరువు తూచేందుకు నాల్‌రోడ్ ప్రాంతానికి పంపారు. ఆ లారీని ధర్మలింగం (47) నడిపాడు. ఆ లారీ సివియర్‌పాళయం వద్ద వెళుతుండగా విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న రెండు వైర్ల రాపిడికి నిప్పురవ్వలు లారీలోని ఎండు కొబ్బరి బస్తాలపై పడ్డాయి. క్షణాల్లో అన్ని బస్తాలకు నిప్పంటుకోవడంతో లారీ దగ్ధమైంది. ఈ సమాచారం తెలుసుకుని అగ్నిమాపక దళం సభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకుని గంటసేపు పోరాడి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.


దగ్ధమవుతున్న లారీ

### కుటుంబాన్ని బలిగొన్న రుణభారం

*టీచర్ దంపతులు సహా ఐదుగురి ఆత్మహత్య ● శివకాశిలో ఘోరం*

ప్యారీస్, మే 23: అప్పుల బాధతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన విరుదునగర్ జిల్లా శివకాశిలో చోటుచేసుకుంది. దీనిపై గురువారం శివకాశి పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి... శివకాశి సమీపంలో ఉన్న తిరుత్తంగల్ బాలాజీనగర్‌కు చెందిన లింగం (50) దేవదానపట్టిలో ఉన్న యూనియన్ ప్రాథమిక పాఠశాలలో టీచర్‌గా, ఆయన భార్య పళనియమ్మాళ్ (45) శుక్రవారపట్టి ప్రాథమిక పాఠశాల టీచర్‌గా పనిచేస్తున్నారు. మొదటి భర్త మరణించడంతో లింగంను పళనియమ్మాళ్ రెండో వివాహం చేసుకున్నారు. మొదటి భర్త కుమార్తె ఆనందవల్లి (27) వివాహం చేసుకొని రెండు నెలల క్రితం పుట్టింట్లోనే కుమార్తెకు జన్మనిచ్చింది. లింగం కుమారుడు ఆదిత్య ఈ కుటుంబంతోనే కలిసి ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో, లింగం, ఆయన కుటుంబసభ్యులు బుధవారం ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో అనుమానించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడకు చేరుకున్న పోలీసులు తలుపులు బద్దలుకొట్టి లోనికి వెళ్లి చూడగా, లింగం కుటుంబసభ్యులందరూ విగతజీవులుగా పడి ఉండడం గుర్తించారు. మృతదేహాలను విరుదునగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషాద ఘటనపై ప్రాథమిక విచారణలో, అప్పులు బాధ కారణంగా ఈ ఐదుగురు విషం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. ముందుగా ఆనందవల్లి బిడ్డకు విషం ఇచ్చి, ఆ తరువాత మిగిలిన నలుగురూ ఆత్మహత్య చేసుకుని వుంటారని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

### 26న 'ఏడో ఋతువు' కవితా సంపుటి ఆవిష్కరణ

చెన్నై, మే 23 (ఆంధ్రజ్యోతి): వేదవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'ఏడో ఋతువు' కవితా సంపుటిని ఆదివారం ఆవిష్కరించనున్నారు. తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 149వ ప్రసంగ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 26 సాయంత్రం ఆంధ్రాక్లబ్ కృష్ణాహాల్‌లో హైదరాబాద్‌కు చెందిన విశిష్ట యౌగిక విశ్వకవి విశ్వర్షి వాసిలి (డా. వాసిలి వసంతకుమార్) రచించిన 'ఏడో ఋతువు' వర్తమాన వచన కవితా సంపుటిని ఆవిష్కరించనున్నారు. అదే సమయంలో 'తొలి తెలుగు యౌగిక కావ్యం 'నేను' : వైవిధ్యత, వినూత్నత' అనే అంశంపై కూడా ఆయన ప్రసంగించనున్నారని వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు ఓ ప్రకటనలో తెలిపారు.

# వైభవంగా నృసింహ స్వామి జయంతి వేడుకలు

వేలూరు, మే 23: వేలూరు బ్రాహ్మణ సంఘం, విష్ణు సహస్రనామ మండలి సంయుక్త ఆధ్వర్యంలో వైకాశి విశాఖ, నృసింహ జయంతి వైభవంగా జరిగింది. స్థానిక సత్తువాచేరిలో బుధవారం రాత్రి జరిగిన ఈ వేడుకలకు వేలూరు బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రాజ, విష్ణు సహస్రనామ మండలి అధ్యక్షుడు సత్యమూర్తి అధ్యక్షత వహించారు. జనరల్ సెక్రటరీ జయకుమార్, కోశాధికారి రాజగోపాల్, ఆర్గనైజర్ సుబ్రమణి, మండల సభ్యుడు లక్ష్మీనారాయణన్, మండల సెక్రటరీ టీఎస్ లక్ష్మణన్ తదితరులు పాల్గొన్నారు. బ్రాహ్మణ సంఘ ఉపాధ్యక్షుడు విజయరాఘవన్, అడ్వయిజర్ సత్యమూర్తి ప్రపంచ శాంతి కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. సెక్రటరీ లక్ష్మణన్ వందన సమర్పణతో వేడుకలు ముగిశాయి.


బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నృసింహ స్వామి జయంతి వేడుకలు

**స్వర్ణాలయంలో...**


శ్రీపురం స్వర్ణాలయంలో బుధవారం రాత్రి నృసింహ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వర్ణాలయం ప్రాంగణంలోని శ్రీనివాస పెరుమాళ్ ఆలయంలో శక్తి అమ్మ అధ్యక్షతన 1,008 పారంపర్య నెయ్యి దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.


స్వర్ణాలయంలో 1,008 నెయ్యి దీపాల ప్రదర్శన

### మళ్లీ రాజ్‌భవన్ ఆహ్వాన పత్రిక వివాదం

**కాషాయ దుస్తుల్లో తిరువళ్లువర్**

పెరంబూర్, మే 23: రాజ్‌భవన్ విడుదల చేసిన ఆహ్వాన పత్రికలో కాషాయ దుస్తుల్లో తిరువళ్లువర్ చిత్రం ఉండడం చర్చనీయాంశమైంది. 'తిరువళ్లువర్ తిరునాళ్ విళా' అనే పేరుతో రాజ్‌భవన్ ఆహ్వాన లేఖ విడుదల చేసింది. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు గవర్నర్ ఆర్‌ఎన్ రవి నేతృత్వంలో తిరువళ్లువర్ వేడుకలు నిర్వహించనున్నట్లు రాజ్‌భవన్ అందులో పేర్కొంది. గవర్నర్ కార్యదర్శి కిర్లోష్ కుమార్ పేరుతో విడుదల చేసిన ఈ ఆహ్వాన పత్రికలో, తిరువళ్లువర్ కాషాయ దుస్తులతో చిత్రం వేశారు.. ఇదివరకు రాజ్‌భవన్ విడుదల చేసే ప్రకటనలో ఇలాగే తిరువళ్లూర్ చిత్రం కాషాయ దుస్తులతో ఉండగా, తాజాగా విడుదల చేసిన ఆహ్వాన లేఖలోనూ ఇలాగే ఉండడం చర్చనీయాంశమైంది. దీనిని తీవ్రంగా ఖండించిన పలు పార్టీలు, సంస్థలు ఆందోళనకు పిలుపునిచ్చారు.



ఆహ్వానంలో కాషాయ దుస్తుల్లో తిరువళ్లువర్ చిత్రం

### బదిలీలు కోరుతూ 63,433 మంది దరఖాస్తు

ఐసిఎఫ్, మే 23: బదిలీ కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు 63,433 మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్ శుక్రవారం నుంచి జూన్ 30వ తేది వరకు జరుగనుంది. ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు దరఖాస్తు నమోదు ఈ నెల 12న ప్రారంభం కాగా, ఇప్పటివరకు 63,433 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రాథమిక విద్యాశాఖలో సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీకి 14,078 మంది, డిగ్రీ టీచర్ల బదిలీకి 7,106 మంది, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల బదిలీకి 4,309 మంది, మాధ్యమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల బదిలీకి 822 మంది, పాఠశాల విద్యాశాఖలో సెకండరీ గ్రేడ్ టీచర్లు 719 మంది, డిగ్రీ టీచర్లు 20,466 మంది, పీజీ టీచర్లు 14,308 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 913 మంది, మహోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 952 మంది బదిలీ కోరుతూ దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు.

### ఏటీఎం నుంచి రూ.100 బదులు రూ.500 నోట్లు!

పెరంబూర్, మే 23: పుదుకోట జిల్లాలోని ఓ ఏటీఎంలో రూ.100కు బదులుగా రూ.500 నోట్లు రావడం కలకలం రేపింది. కీరనూరు కిల్లుకోట సమీపంలోని ఏటీఎంలో బుధవారం ఓ వినియోగదారుడు నగదు డ్రాచేయగా రూ.100 బదులు రూ.500 నోట్లు వచ్చాయి. ఈ విషయం చుట్టుపక్కల ప్రాంతాలకు పాకడంతో పలువురు ఏటీఎం వద్దకు చేరుకొని నగదు డ్రా చేశారు. సమాచారం అందుకున్న బ్యాంక్ సిబ్బంది వచ్చి మెషీన్‌ను పరిశీలించగా, రూ.100నోట్లు ఉంచాల్సినచోట రూ.500 నోట్లు ఉంచినట్లు గుర్తించారు. ఈలోగా రూ.2.50 లక్షల వరకు డ్రా చేసినట్లు తెలిసింది. అలా పొందినవారు సుమారు రూ.60 వేలను బ్యాంక్‌లో తిరిగి అందజేయగా, మిగతా నగదు కోసం డ్రా చేసిన వారి బ్యాంక్ ఖాతాలు పరిశీలిస్తున్నారు.

### గంజాయి తరలిస్తున్న విద్యార్థి సహా ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, మే 23: స్థానిక వాషర్‌మెన్‌పేట సమీపంలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న విద్యార్థి, అతని సోదరుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మూలకొత్తలం ప్రాంతంలో బుధవారం రాత్రి తనిఖీలు చేపట్టిన పోలీసులు, అటువైపు వచ్చిన కారులో తనిఖీ చేయగా అందులో కిలో గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో కళాశాల విద్యార్థి చంద్రు, అతని సోదరుడు విఘ్నేష్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు, వారు వెళుతున్న కారు కూడా స్వాధీనం చేసుకున్నారు.

### సీపీఎల్ సంస్థలకు రూ.5 కోట్ల జరిమానా

ఐసిఎఫ్, మే 23: ముడిచమురు సముద్రంలో విడుదల చేసిన వ్యవహారంలో సీపీసీఎల్ సంస్థకు రూ.5 కోట్లు జరిమానా విధిస్తూ దక్షిణ మండల గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వులు జారీచేసింది. చెన్నై పెట్రోలియం సంస్థ (సీపీసీఎల్)కు చెందిన ఆయిల్ పైప్ లైన్ నుంచి గత ఏడాది మార్చిలో నాగపట్టణం సముద్రం నుంచి కీచాన్ కుప్పం వరకు 2 కి.మీ మేర ముడిచమురు లీకయి సముద్రంలో కలిసింది. ఈ వ్యవహారానికి సంబంధించి దక్షిణ మండల ట్రిబ్యునల్ సుమోటో కేసు నమోదుచేసి విచారించింది. పర్యావరణానికి హాని కలుగనప్పటికీ, ఇలాంటి చర్యలకు పాల్పడినందుకు ఆ సంస్థకు రూ.5 కోట్లు జరిమానా విధించింది. ఈ జరిమానాను రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డుకు చెల్లించాలని సూచించింది.

### శివకాశిలో 24 బాణసంచా కర్మాగారాల మూసివేత

పెరంబూర్, మే 23: విరుదునగర్ జిల్లా శివకాశి నిబంధనలు అతిక్రమించిన 24 బాణాసంచా కర్మాగారాలు మూతపడ్డాయి. బాణాసంచా కర్మాగారాల్లో సంభవిస్తున్న ప్రమాదాల నివారణకు జిల్లా యంత్రాంగం నియమించిన 9 ప్రత్యేక బృందాలు జిల్లా వ్యాప్తంగా బాణసంచా కర్మాగారాల్లో తనిఖీలు చేస్తున్నాయి. పరిశీలనలో నిబంధనలు అతిక్రమించి పనిచేస్తున్న మూడు బాణసంచా దుకాణాలు, ఒక గోదాముకు అధికారులు సీలు వేశారు. అలాగే, పరిశీలనలో 9 కర్మాగారాల్లో ఉన్న చిన్న లోపాలు సరిచేయాలంటూ సంబంధిత కర్మాగారాల యజమానులకు అధికారులు నోటీసులు జారీచేశారు.

### మేక రక్తం తాగిన పూజారి మృతి

పెరంబూర్, మే 23: గోపిచెట్టిపాళయం సమీపంలో ఆలయ వేడుకల్లో మేకను బలిచ్చి దాని రక్తం తాగిన పూజారి మృతిచెందిన ఘటన భక్తులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈరోడ్ జిల్లా గోపిచెట్టిపాళయం సమీపం సెట్టియాంపాళయంలోని ఆలయ వేడుకల్లో భాగంగా బుధవారం స్వామివార్లకు మేకలు బలిచ్చిన నల్లగౌండన్‌పాళయానికి చెందిన పూజారి పళనిస్వామి (45), మేక రక్తంతో పాటు అరటి పండు తిన్నారు. తిన్న కొద్దిసేపటికే ఆయన వాంతులు చేసుకుంటూ స్పృహతప్పి పడిపోవడంతో చుట్టుపక్కల వారు ఆయనను వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై సిరువెల్లూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

### బోగస్ సంస్థల్లో నగదు చెల్లించి మోసపోవద్దు

ప్యారీస్, మే 23: విదేశాల్లో ఉద్యోగాలు, చదువుకొనేందుకు దరఖాస్తు చేసుకొనే యువకులు, విద్యార్థులు బోగస్ సంస్థల్లో నగదు చెల్లించి మోసపోవద్దని తిరువళ్లూర్ జిల్లా ఎస్పీ శ్రీనివాస పెరుమాళ్ హెచ్చరించారు. ఆయన గురువారం విడుదల చేసిన ప్రకటనలో... విదేశీ ఉద్యోగాలు, చదువుకోసం ఆయా సంస్థలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా అని విద్యార్థులు, నిరుద్యోగ యువత నిర్ధారించుకున్న తర్వాతే దరఖాస్తు చేయాలని సూచించారు. ఉద్యోగాల పేరుతో ఆకర్షణీయమైన ప్రకటనలు చేస్తున్న బోగస్ సంస్థలతో సంప్రదించవద్దని, ఒకవేళ ఆ సంస్థల వల్ల మోసపోయిన వారు ముందుగా ఆయా ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదుచేసిన అనంతరం ఎలాంటి ఆలస్యం లేకుండా న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని ఎస్పీ సూచించారు. కాగా, బోగస్ సంస్థల వ్యవహారశైలిపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎస్పీ తన ప్రకటనలో తెలిపారు.

### కోవై విమానాశ్రయంలో ప్రయాణికులకు వైద్యపరీక్షలు

ఐసిఎఫ్, మే 23: కోయంబత్తూర్ విమానాశ్రయంలో ప్రయాణికులకు వైద్యపరీక్షలు ముమ్మరం చేశారు. ఈ విమానాశ్రయం నుంచి షార్జాకు వారంలో అన్ని రోజులు, సింగపూర్‌కు వారంలో ఐదు రోజులు అంతర్జాతీయ విమానాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో, సింగపూర్‌లో కొత్త రకం కరోనా వైరస్ వ్యాపించినట్లు వార్తలు వెలువడుతున్నాయి. దీంతో, సింగపూర్, షార్జాల నుంచి విమానాల ద్వారా కోయంబత్తూర్ వచ్చే ప్రయాణికులను ముందు జాగ్రత్త చర్యలుగా పరీక్షిస్తున్నారు. ఈ విషయమై విమానాశ్రయ అధికారులు మాట్లాడుతూ... రాష్ట్రంలో గత సారి కరోనా వ్యాపించినప్పుడు ప్రజల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండేదని, ప్రస్తుతం వారికి రెండు డోసులు టీకాలు వేయడంతో భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. అయినప్పటికీ, మళ్లీ రాష్ట్రంలో దీని ప్రభావం ఎక్కువ కాకుండా ఉండేలా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామని వివరించారు.

### రేషన్ దుకాణాల పనివేళల్లో మార్పు

ఐసిఎఫ్, మే 23: రేషన్ దుకాణాల పనివేళల్లో మార్పులు జరిగాయి. రేషన్ దుకాణాలు చెన్నై, శివారు ప్రాంతాల్లో ఉదయం 8.30నుంచి మధ్యాహ్నం 12.30, 3గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పనిచేస్తున్నాయి. ఇతర జిల్లాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1, 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తున్నాయి. చెన్నై, శివారు ప్రాంతాల్లో మధ్యాహ్నం రేషన్ దుకాణాలు మూసివేసి మళ్లీ తెరిచేందుకు రెండున్నర గంటల సమయం పడుతోంది. ఈ సమయంలో వినియోగదారులు పొందని వస్తువులను కొందరు ఉద్యోగులు బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నారు. దీనిపై అందిన ఫిర్యాదుల మేరకు, మధ్యాహ్నం దుకాణాలు మూసే సమయాన్ని తెరిచే సమయంలో ఉన్న విరామాన్ని తగ్గించనున్నట్లు అధికారులు తెలిపారు.


ఎగ్మూరులోని మహాబోధి సెంటర్‌లో బుద్ధపూర్ణిమ సందర్భంగా దర్శించు కుంటున్న యువతీ యువకులు, విద్యార్థులు

## వైవిధ్యాలకు నెలవు

# పెరువయల్ మురుగన్ కోవెల

- ఒకే చోట తిరుచెందూరు, రామేశ్వరం స్వాములు
- కడలిగర్భంలో బయల్పడ్డ కుమారస్వామి

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పర్వతవర్ధినీ సమేత రామనాథస్వామివారి ఆలయం, రామాయణ ఘట్టాలతో కీర్తిచెందిన రామనాథపురానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉన్న పెరువయల్ శివసుబ్రహ్మణ్యస్వామి ఆలయం ప్రముఖ శైవక్షేత్రంగా భాసిల్లుతోంది. ఈ ఆలయంలో పరమేశ్వరుడు, ఆయన తనయుడైన కుమారస్వామి వేర్వేరు సన్నిధుల్లో భక్తులతో పూజలందుకుంటున్నారు. ఎన్నో వైవిధ్యాలకు నెలవైన ఈ ఆలయంలో వీరిద్దరిని దర్శిస్తే తిరుచెందూరు సెంథిల్ ఆండవర్‌ను దర్శించినంత పుణ్యఫలం దక్కుతుందని శైవాగమ పండితులు చెబుతున్నారు. అదే విధంగా ఆలయంలోని పరమేశ్వరుడిని దర్శించుకుంటే రామేశ్వరం రామనాథస్వామివారిని దర్శించినంత ఫలమని కూడా పేర్కొంటున్నారు. ఈ ఆలయంలోని శూలాయుధంలో మయూర వాహనంపై ఆసీనుడైన కుమారస్వామి రూపం చెక్కబడి ఉంది.. సుబ్రహ్మణ్యస్వామి కొలువైన దివ్యక్షేత్రాల్లో ఎక్కడా ఇలా శూలాయుధంపై మురుగన్ రూపాన్ని చూడలేమని పండితులు పేర్కొంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, చెన్నై


ఆలయ ప్రవేశద్వారానికి ఇరువైపులా అశ్వపాలకులు


ఆలయరాజగోపురం


→ ధ్వజస్తంభం

### రణబలి మురుగన్...

స్వామివారి విగ్రహాలను అన్వేషించేందుకు కడలిలలో దిగిన గజ ఈతగాళ్ళకు వళ్ళంతా రణాలు (పుండ్లు) ఏర్పడ్డాయి. ఆ సంఘటనను తలపించే రీతిలో ఈ ఆలయంలోని స్వామిని 'రణబలి మురుగన్' అని కూడా పిలుస్తారు. ఇక్కడి స్వామివారు భక్తుల మనస్సుల్లో రణాలుగా ఉండే రుణబాధలు, శత్రు బాధలను, చేతబడుల వల్ల కలిగే బాధలను తొలగించి సకల సౌభాగ్యాలు కల్పిస్తారు కనుక స్వామివారిని రణబలి మురుగన్‌గా పిలువడటం సముచితమేనని శైవాగమ పండితులు చెబుతారు.

### ఆలయ వైభవం...

ఈ ఆలయ రాజగోపురం ఐదంతస్తులతో తూర్పుదిశగా నిర్మితమై ఉంది. ఆలయ ప్రవేశద్వారానికి ఇరువైపులా అందమైన అశ్వాల విగ్రహాలు కనిపిస్తాయి. ఓ అశ్వంపై భద్రకాళి అమ్మవారి ఉపాసకులైన ఆదిమంగళేశ్వర గురువులు, దానికెదురుగా ఉన్న మరో అశ్వంపై భద్రకాళి రూపం చెక్కబడి ఉన్నాయి. ఏ మురుగన్ ఆలయం ప్రవేశద్వారంలో ఇలాంటి రూపాలుండవు. కాలసంధి, సూర్యాస్తమయ వేళ పూజల సందర్భంగా ఈ రెండు అశ్వ విగ్రహాలకు నైవేద్యం సమర్పించిన తర్వాత ఆలయ బలి పీఠానికి నైవేద్యం సమర్పిస్తారు. ఆలయంలోకి ప్రవేశించగానే జయంకొండ వినాయకుడు దర్శనమిస్తారు. బలిపీఠం, ధ్వజస్తంభం, మయూరవాహనం, అర్ధమండపం దాటి వెళితే మూలమూర్తి గర్భాలయం ఉంది. ఆ గర్భాలయంలో వళ్ళి దేవసేన సమేతుడైన శివసుబ్రహ్మణ్యస్వామి కరుణామూర్తిగా భక్తులను అనుగ్రహిస్తున్నారు. పొగడ చెట్టు ఈ ఆలయ స్థలవృక్షం. ఆలయానికి చేరువగానే శరవణపొయిగ్గై పేరుతో తీర్థకొలను కూడా ఉంది.


శత్రుసంహార శూలాయుధం


### స్థలపురాణం..

పూర్వం రామనాథపురం సంస్థానాన్ని కీల్‌వన సేతుపతి అనే చక్రవర్తి పరిపాలిస్తుండేవారు.. ఆయనకు అత్యంత విశ్వాసపాత్రుడైన సాతప్పన్ ఆ సంస్థానానికి దళపతిగా పనిచేసేవారు. ఆయన మురుగన్ భక్తుడు. తరచూ తిరుచెందూరు వెళ్ళి సెంథిల్ ఆండవర్‌ను దర్శించేవారు. ఓ రోజు దళపతి సాతప్పన్ కలలో ప్రత్యక్షమైన సుబ్రహ్మణ్యస్వామి 'సాతప్పా ఇకపై నా దర్శనం కోసం ఎంతో కష్టపడి తిరుచెందూరుకు రానవసరం లేదు. దేవీపట్నం కడలిలో నవపాషాణ శిలలు మెండుగా ఉన్న స్థలానికి తూర్పుదిశగా 'కన్నాములై' అనే ప్రాంతం పైన గరుత్మంతుడు తిరుగుతాడు. ఆ ప్రదేశంలో కడలిపై చిన్న పర్వతం, నిమ్మ పండు తేలుతుంటాయి.ఆ కడలి గర్భంలో శత్రుసంహార శూలాయుధంతో, వళ్లీ దేవసేన సమేతంగా స్వయంభువుగా ఉన్నాను. గర్భం నుండి నన్ను వెలుపలకు తీసి పెరువయల్‌లో ప్రతిష్ఠ చేయించి, నిత్యం దర్శించుకో నాయనా! నీకు ఇకపై అన్నీ శుభాలే కలుగుతాయి' అని చెబుతారు. ఇదే రీతిలో తిరుఉత్తిరకోశమంగై ప్రాంతానికి చెందిన ఆదిమంగళేశ్వర గురువులకు కూడా కుమారస్వామి కలలో ప్రత్యక్షమై కడలి నుంచి తన విగ్రహాన్ని వెలికి తీసేందుకు సాతప్పన్‌కు సాయం చేయడానికి దేవీపట్నం వెళ్లు!' అంటూ ఆదేశిస్తారు. మరుసటి రోజు ఆదిమంగళేశ్వర గురువు, దళపతి సాతప్పన్ కలిసి కలలో కుమారస్వామి చెప్పిన ఆనవాళ్లను బట్టి కడలి ప్రాంతానికి చేరుకుంటారు. కొంతమంది గజ ఈతగాళ్లను సముద్రంలోకి దింపి, మురుగన్ విగ్రహాన్ని బయటకు తీసుకురమ్మని పురమాయిస్తారు. గంటల తరబడి సముద్రగర్భంలో గజ ఈతగాళ్లు వెదికినా స్వామివారి విగ్రహాలు కనిపించలేదు. అయితే సముద్ర గర్భం నుండి పైకొచ్చిన వారి వంటిపై తీవ్ర రణాలు (పుండ్లు) ఏర్పడ్డాయి.. చివరకు దళపతి సాతప్పన్ సాహసించి కడలిలో దూకి తీవ్రంగా వెదికిన తర్వాత స్వామివారి విగ్రహం లభ్యమైంది. సాతప్పన్ ప్రాణాలకు తెగించి వళ్ళి, దేవసేన సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలు, శత్రుసంహార శూలయుధంతో పైకొచ్చాడు. వాటిని పెరువయల్‌కు తీసుకెళ్ళి ఆలయాన్ని నిర్మించడానికి సిద్ధమయ్యాడు. ఆ విషయం తెలుసుకున్న చక్రవర్తి తన అంతఃపురంలో దర్బార్ మండపాన్ని నిర్మించేందుకు సిద్ధం చేసిన సామగ్రినంతా పెరువయల్ గ్రామానికి పంపి, ఊరణి ఒడ్డున మురుగన్‌కు ఆలయం నిర్మించేందుకు అనువైన స్థలాన్ని కూడా దానంగా ఇచ్చారు.. ఆ తర్వాత దళపతి సాతప్పన్ స్థానికుల సహకారాలతో చక్రవర్తి పంపిన సామగ్రితో అందమైన ఆలయాన్ని నిర్మించి కడలిలో లభ్యమైన వళ్ళి దేవసేన సమేతుడైన మురుగన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించి మహాకుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయంలో పాటించే ఆగమ విధుల ప్రకారం ఈ ఆలయంలో స్వామివారికి నిత్యపూజలు, ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దళపతి సాతప్పన్ రామేశ్వరంలోని పర్వతవర్ధినీ సమేత రామనాథస్వామిపై కూడా అపారమైన భక్తి ప్రపత్తులతో ఉండేవారు. ఆ కారణంగా పెరువయల్ శివసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో రామేశ్వరం రామనాథస్వామి, పర్వతవర్ధిని అమ్మవారికి ప్రత్యేక మందిరాలు కూడా నిర్మించారు.తిరుచెందూరులోని సుబ్రహ్మణ్యస్వామి,రామేశ్వరం రామనాథస్వామిని ఈ ఆలయంలో దర్శించుకుని భక్తులు వారి అనుగ్రహం పొందుతుండటం విశేషం. రామనాధపురంలో విస్తారమైన పొలాలు ఉండటం వల్ల ఈ ప్రాంతాన్ని తమిళంలో 'పెరువయల్' (పెద్ద పంటపొలాలున్న ప్రాంతం) అని పిలుస్తున్నారు. పూర్వం ఈ ప్రాంతం తంజావూరులాగే ధాన్యాగారంగా ఉండేదని చరిత్రకారులు చెబుతున్నారు.


రామనాథస్వామి










నందీశ్వరుడు

వళ్లీదేవసేన సమేత శివసుబ్రహ్మణ్యస్వామి - గర్భాలయంలో వళ్ళీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి - పర్వతవర్ధినీ అమ్మవారు - వినాయక స్వామి

**స్వామివారి నామధేయం : శివసుబ్రహ్మణ్యస్వామి**
**అమ్మవార్ల నామధేయం : వళ్ళి, దేవ సేన**
**స్థలవృక్షం : పొగడచెట్టు, తీర్థం : శరవణపొయిగ్గై**

ఆధ్యాత్మికం

**ఆలయ విశేషాలు... :** ఈ ఆలయంలో మురుగపెరుమాన్‌కు అన్ని ముఖ్య దినాల్లో ప్రత్యేక అభిషేకాలు, ఆరాధనలు, పూజలు నిర్వహిస్తారు. మాసి మాసంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఆ వేడుకల్లో తిరుచెందూరు ఆలయంలో జరిగేలా ఎరుపు, తెలుపు, ఆకుపచ్చ పట్టు వస్త్రాలు ధరించి స్వామివారు భక్తులకు కనువిందు చేస్తారు. ఏడు రోజులపాటు జరిగే స్కంధషష్ఠి వేడుకల్లో సముద్ర గర్భంలో లభించిన శత్రుసంహార శూలాయుధంతో శూరపద్ముడి వధ ఘట్టాన్ని నిర్వహిస్తారు. ప్రతి రోజూ నాలుగు కాలాల పూజలు జరుగుతాయి. ఈ ఆలయంలో ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

### శూలాయుధంపై మురుగన్...

దళపతి సాతప్పన్ సముద్రంలో దిగి వెదికినప్పుడు మురుగన్ ఆయన కలలో ప్రత్యక్షమైన విధంగానే వళ్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహంతోపాటు, ఓ శూలాయుధం కూడా లభించింది. దానిని శత్రుసంహార శూలాయుధం అని పిలుస్తారు. ఈ శూలాయుధంలో మురుగన్ రూపం చెక్కబడి ఉంది. మరే ఇతర మురుగన్ ఆలయాల్లో ఇలాంటి శూలాయుధాన్ని చూడలేం. ఈ శూలాయుధం విశిష్టతలను గురించి ఆధ్యాత్మిక ప్రవచనకర్త కృపానందవారియార్ స్వామి కూడా తన ప్రసంగాల్లో పలుమార్లు ప్రస్తావించారు. ప్రస్తుతం ఈ శత్రు సంహార శూలాయుధం రామనాథపురం ఆస్థానంలో భద్రపరిచారు. యేడాదికొకమారు జరిగే మాసి బ్రహోత్సవాల్ల భక్తుల దర్శనార్థం ఆ శూలాయుధాన్ని శివసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఉంచుతారు.

### ఎలా వెళ్ళాలి?...

రామనాథపురం నగరానికి రాష్ట్రం నలుమూలల నుంచి రవాణా సంస్థ బస్సులు, ఆమ్నీ బస్సులు నడుపుతున్నారు. రైలులో కూడా రామనాథపురానికి వెళ్ళవచ్చు. రామనాథపురం బస్టాండు, రైల్వేస్టేషన్ నుండి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో దేవీపట్నం వెళ్లే దారిలో ఈ ఆలయం ఉంది. టౌన్ బస్సులో వెళ్తే పెరువయల్ విలక్కు అనే చోట దిగాలి. అక్కడి నుంచి ఆటోలో పడమటి దిశగా మూడు కిలోమీటర్లు ప్రయాణిస్తే పెరువయల్ ఆలయాన్ని చేరుకోవచ్చు. ఆటోలు, టాక్సీల్లో నేరుగా పెరువయల్ ప్రాంతానికి వెళ్లొచ్చు.


శూలాయుధంపై కుమారస్వామి రూపం

చిత్రజ్యోతి

## రూ.వంద కోట్ల క్లబ్‌లో 'అరణ్మనై-4'

సుందర్ హీరోగా నటించి దర్శకత్వం వహించిన చిత్రం 'అరణ్మనై-4'. ఈ నెల 4వ తేదీ విడుదలై సూపర్ హిట్‌గా నిలిచింది. 'అరణ్మనై' సిరీస్‌లో ఇప్పటివరకు వచ్చిన మూడు చిత్రాల కంటే నాలుగో భాగం ప్రేక్షకులను అమితంగా మెప్పించడమే కాకుండా, భారీ వసూళ్ళను రాబట్టి రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ విషయాన్ని చిత్ర బృందం అధికారికంగా వెల్లడించింది. దీంతో సుందర్ సి నటించి, దర్శకత్వం వహించి, రూ.వంద కోట్ల వసూళ్ళు రాబట్టిన చిత్రంగా 'అరణ్మనై-4' నిలిచింది. ఒక్క తమిళనాడులోనే ఈ చిత్రం రూ.60 కోట్ల మేరకు వసూలు చేసినట్టు కోలీవుడ్ ఫిల్మ్‌ట్రేడ్ వర్గాల సమాచారం. కాగా, 'అరణ్మనై' సిరీస్‌లో ఇప్పటివరకు 1, 2, 3 భాగాలు వచ్చాయి. గత యేడాది విడుదలైన మూడో భాగం బాక్సాఫీస్ వద్ద పూర్తిగా నిరాశపరిచింది. దీంతో నాలుగో భాగాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని తెరకెక్కించిన సుందర్... సక్సెస్‌తో పాటు లాభాలు చూశారు. ఈ సినిమాను ఆయన సతీమణి ఖుష్బూ సొంతంగా నిర్మించగా, ఇందులో తమన్నా, రాశీఖన్నా, యోగిబాబు, వీటీవీ గణేష్ తదితరులు ముఖ్యపాత్రలను పోషించారు.


'అరణ్మనై-4'లో ఓ దృశ్యం

## 'ఇండియన్-2' ఆడియో రిలీజ్‌కు ఇద్దరు స్టార్లు?

శంకర్ దర్శకత్వంలో ఉలగనాయకన్ కమల్ హాసన్ నటించిన 'ఇండియన్-2' చిత్రం జూలైలో విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా జూన్ ఒకటో తేదీ ఈ చిత్రం ఆడియో భారీ స్థాయిలో విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పెరియమేడ్‌లోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఈ వేడుక కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే, ఈ ఫంక్షన్‌కు ముఖ్య అతిథులుగా సూపర్‌స్టార్ రజినీకాంత్, మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ హాజరుకానున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. అలాగే, మెగాస్టార్ చిరంజీవి కూడా పాల్గొనే అవకాశాలున్నట్టు వినికిడి. సాధారణంగా ఆడియో రిలీజ్ ఫంక్షన్లకు రజినీకాంత్ దూరంగా ఉంటారు. కానీ, దర్శకుడు, శంకర్, హీరో కమల్ హాసన్, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ తనకు ఎంతో ఆప్తులు కావడంతో ఈ ఆడియో రిలీజ్ వేడుకలో పాల్గొనేందుకు సమ్మతించినట్టు కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. అదేవిధంగా రామ్ చరణ్ హీరోగా శంకర్ 'గేమ్ ఛేంజర్' అనే చిత్రాన్ని రూపొందిస్తున్నారు. దీంతో ఈ వేడుకకు చెర్రీతో ఆయన తండ్రి, మెగాస్టార్ చిరంజీవి రానున్నట్టు తెలుస్తుంది. అయితే, ఈ ఫంక్షన్‌లో పాల్గొనే అతిథుల వివరాలను నిర్మాణ సంస్థ అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.


రజినీకాంత్

## వరుస చిత్రాలకు కమిట్ అవుతున్న అజిత్!

అగ్రనటుడు అజిత్ వరుస చిత్రాలకు కమిట్ అవుతున్నారు. ప్రస్తుతం ఆయన ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో నటిస్తున్నారు. దీనికి 'గుడ్ బ్యాడ్ అగ్లీ' అనే టైటిల్ ఖరారు చేయగా, సంక్రాంతికి రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలావుంటే, మగిళ్ తిరుమేని దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'విడాముయర్చి' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది. అంటే ఈ యేడాది రెండు చిత్రాలను అజిత్ పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత మరో రెండు చిత్రాలను ఆయన లైనులో పెట్టారు. వీటిలో ఒకటి 'చిరుత్తై' శివ దర్శకత్వం వహించనుండగా, మరో చిత్రానికి మోహన్ రాజా దర్శకత్వం చేసే అవకాశం ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. గతంలో కొత్త ప్రాజెక్టులకు కమిటయ్యే విషయంలో ఒకింత జాప్యం చేసే అజిత్.. ఇపుడు తాను కమిటైన చిత్రాల నిర్మాణం పూర్తికాకముందే కొత్త ప్రాజెక్టులను అంగీకరించేందుకు మొగ్గు చూపడం గమనార్హం.


'గుడ్ బ్యాడ్ అగ్లీ'లో అజిత్ కుమార్

## ప్రకృతి అందాలే విస్తుపోయేలా....

జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటించిన 'బ్యాచిలర్' చిత్రం ద్వారా తమిళ వెండితెరకు పరిచయమైన భామ దివ్య భారతి. తన తొలి చిత్రంలోనే ఎలాంటి భయం, బెరుకు లేకుండా హీరోతో ఎంతో సన్నిహితంగా నటించి, యువకుల మనసుల్లో చోటు సంపాదించుకుంది. ఆ తర్వాత ఆమె నటించిన సినిమాలు పెద్దగా ఆదరణకు నోచుకోలేదు. అయితే, సోషల్ మీడియాలో మాత్రం ఆమె చాలా యాక్టివ్‌గా ఉంటూ ఎక్స్‌పోజ్ చేస్తూ దిగిన ఫొటోలను షేర్ చేస్తూ నెటిజన్లను సంతోషపెడుతోంది. ఈ నేపథ్యంలో ఆమె... శ్రీలంకలోని పర్యాటక ప్రాంతాలకు వెళ్లి అక్కడ టూ పీస్ దుస్తుల్లో పూర్తి స్థాయి గ్లామరస్‌గా ఎక్స్‌పోజ్ చేస్తూ తీసిన ఫొటోలు ఇపుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ప్రకృతి అందాలే విస్తు పోయేలా ఆమె తన అందాలను ఆరబోసింది. ముఖ్యంగా స్విమ్ సూట్‌తో దిగిన ఫొటోలు ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.


దివ్యభారతి



*సూపర్‌స్టార్ రజినీకాంత్‌కు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) గోల్డెన్ వీసా మంజూరు చేయగా, అబుదాబీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కల్చర్ అండ్ టూరిజం (డీసీటీ) చైర్మన్ మొహ్మద్ ఖలీఫా అల్ ముబారక్ ప్రదానం చేశారు.*

## టి.నగర్‌లో 'సిడ్నీ స్ట్రాండ్స్' ప్రారంభం

పెరంబూర్, మే 23: స్థానిక టి.నగర్ వీకేర్ గ్రూప్స్ ఆధ్వర్యంలో 'సిడ్నీ స్ట్రాండ్స్' కార్యాలయం గురువారం ప్రారంభించారు.. సౌత్ బోగ్ రోడ్డులోని ఏర్పాటుచేసిన ఈ కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా వీకేర్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ కేరోలిన్ ప్రభారెడ్డి, సీఈఓ ముకుందన్ సత్యనారాయణన్ పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తలపై వెంట్రుకలు కోల్పోయిన వారికి ఆర్టిఫియల్ ద్వారా వెంట్రుకలు వచ్చేలా ప్రత్యేక చికిత్స అందించనున్నామన్నారు. ఈ చికిత్సలో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని, ఇప్పటివరకు 100 శాతం ఫలితాలు సాధించామని తెలిపారు. తమ గ్రూప్ ఆధ్వర్యంలో ఇది తొలి కార్యాలయం కాగా, త్వరలో దేశవ్యాప్తంగా మరిన్ని ఏర్పాటు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వీ కేర్ గ్రూప్ ఎండీ కేరోలిన్ ప్రభారెడ్డి, సీఈఓ ముకుందన్ సత్యనారాయణన్

### మధుమేహ నియంత్రణ కోసం....

## ఎంబెడ్యూర్ సిస్టమ్స్‌తో ఎండీఆర్ఎఫ్ ఒప్పందం

చెన్నై, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆసియాలోనే స్వతంత్ర మధుమేహ పరిశోధనా సంస్థ అయిన మద్రాస్ డయాబెటీస్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎండీఆర్ఎఫ్) దేశంలో మధుమేహ వ్యాప్తిని తగ్గించే దిశగా వైద్యరంగానికి సంబంధించిన సాఫ్ట్‌వేర్ పరిజ్ఞానాన్ని సమకూర్చే ఎంబెడ్యూర్ సిస్టమ్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా గురువారం మధ్యాహ్నం ఏర్పాటైన మీడియా సమావేశంలో ఎండీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ వీ మోహన్ తెలిపారు. మధుమేహ రోగులకున్న గ్లూకోజ్ శాతాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ వారికి ఇతర అనారోగ్య సమస్యలు రాకుండా నిరోధించడానికి ఈ ఒప్పందం దోహదపడుతుందని చెప్పారు. ఎంబెడ్యూర్ సిస్టమ్స్ సీఈఓ రాజేష్ సి.సుబ్రమణ్యం మాట్లాడుతూ రెండు దశాబ్దాలకు పైగా వైద్యరంగానికి సాఫ్ట్‌వేర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుతున్న తమ సంస్థ ఎండీఆర్ఎఫ్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎండీఆర్ఎఫ్ అందించే మధుమేహ రోగులకు సంబంధించిన వివరాలపై కృత్రిమ మేధోపరిజ్ఞానంతో (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)తో విశ్లేషణ చేస్తామన్నారు. రెండు సంస్థల మధ్య భాగస్వామ్యం మధుమేహ పరిశోధనలో ఓ మైలురాయి అని ఆయన పేర్కొన్నారు.



ఒప్పంద పత్రాలతో ఎండీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ వీ మోహన్, ఎంబెడ్యూర్ సిస్టమ్స్ సీఈఓ రాజేష్ సి.సుబ్రమణ్యం

### ఏఆర్ టెక్నాలజీతో మళ్ళీ కాళ్ళలో చలనం...

## సాయి మల్టీ స్పెషాలిటీ వైద్యుల అద్భుతం

అడయార్, మే 23: స్టేట్ ఆఫ్ ది అగ్మెటెడ్ రియాలిటీ (ఏఆర్) టెక్నాలజీతో చలనం కోల్పోయి 74 యేళ్ళ వృద్ధురాలి మోకాళ్ళకు మళ్ళీ చలనం వచ్చేలా చెంగల్పట్టులోని సాయి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు అరుదైన విజయాన్ని సాధించారు. ఇదే విషయంపై ఆ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ అరుణ్.వి మాట్లాడుతూ, 74 యేళ్ళ వృద్ధురాలు కొంత కాలంలో తీవ్రమైన మోకాళ్ళ నొప్పితో బాధపడుతూ చలనం కోల్పోయారు. అయితే, డాక్టర్ అరుణ్ సారథ్యంలోని వైద్య బృందం ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్) టెక్నాలజీ ద్వారా సంచలనాత్మకమైన మినిమల్లీ ఇన్వాసివ్ సబ్ వాస్టస్ టోటల్ కీ ట్రాన్స్‌ప్లాంటేషన్ విజయవంతంగా పూర్తి చేసి, తద్వారా కాళ్ళలో తిరిగి చలనం తెప్పించారు. ఈ తరహా విధానం ద్వారా మోకాళ్ళలో తిరిగి చలనం తీసుకుని రావడం దేశంలోనే తొలిసారని డాక్టర్ అరుణ్ వివరించారు.


→ మీడియాతో మాట్లాడుతున్న వైద్యులు

## గ్లెనెగ్లెస్ హెల్త్ సిటీలో విజయవంతంగా చేతుల మార్పిడి చికిత్స

అడయార్, మే 23: నగరంలోని గ్లెనెగ్లెస్ హెల్త్ సిటీ చరిత్ర సృష్టించింది. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి సేకరించిన రెండు చేతులను మరో వ్యక్తికి అవయవమార్పిడి ద్వారా విజయవంతంగా అమర్చింది. నగరానికి చెందిన ఆర్.కార్తీక్ అనే రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్‌కు ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా రెండు చేతులను అతికించారు. 31 యేళ్ళ కార్తిక్ యేడాది క్రితం బాణసంచా కాలుస్తుండగా జరిగిన ప్రమాదంలో రెండు చేతులను కోల్పోయాడు. అప్పటి నుంచి చేతులను దానం చేసే వారి కోసం ఎదురు చూశాడు. ఈ క్రమంలో తంజావూరుకు చెందిన ఎం.భవున్ (22) అనే యువకుడు ఓ ప్రమాదం బారిన పడి బ్రెయిన్ డెడ్ అయ్యాడు. దీంతో అతని రెండు చేతులను దానం చేసేందుకు మృతుడి తల్లిదండ్రులు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ నెల 21వ తేదీన, మే 2వ తేదీన రెండుసార్లుగా నిర్వహించిన ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా భవున్ శరీరం నుంచి రెండు చేతులను తొలగించి, కార్తీక్‌కు విజయవంతంగా అమర్చినట్టు ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్, హెచ్‌వోడీ డాక్టర్ సెల్వ సీత రామన్ వెల్లడించారు. ఈ ద్వైపాక్షిక హ్యాండ్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌పై ఆమె స్పందిస్తూ, 'ఈ ద్వైపాక్షిక హ్యాండ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ అత్యంత క్లిష్టమైన సవాల్‌తో కూడుకున్నది. దాదాపు 20 గంటలకుపైగా ఈ ఆపరేషన్ జరిగింది. రెండు చేతలను దానం చేసిన మృతుడి కుటుంబానికి ధన్యవాదాలు తెలుపుతున్నాం. ఈ రెండు చేతులను తిరుచ్చి నుంచి గ్రీన్ చానెల్ ద్వారా తీసుకురాగా, ప్లాస్టిక్ సర్జన్, ఆర్థోపెడిసియన్స్, నెఫ్రాలజిస్ట్ ఇలా మొత్తం 18 మంది వైద్యుల బృందం ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నట్టు వివరించారు.



మీడియా సమావేశంలో వైద్యులు, లబ్ధిదారులు

## డాగ్ షోకు విశేష స్పందన

ప్యారీస్, మే 23: దిండుగల్ జిల్లాలో వేసవి విడిది ప్రాంతమైన కొడైకెనాల్‌లో ఈ నెల 17న ప్రారంభమైన వేసవి వేడుకల్లో ప్రభుత్వ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బ్రయాంట్ పార్క్‌లో 23వ డాగ్ షో బుధవారం ప్రారంభమైంది. ఇందులో పలు జిల్లాల నుంచి సుమారు వంద రకాలకు పైగా శునకాలను తీసుకువచ్చారు. జర్మన్ షెపర్డ్, బగ్, బొమోరియన్, బిడ్‌బుల్, రాట్ వీలర్, గ్రేట్ డాన్ సహా పలు విదేశీ శునక జాతులు పాల్గొన్నాయి. ఆరు రౌండ్లుగా నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న 13 రకాల శునకాల యజమానులకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాన్ని నిర్వాహకులు గురువారం అందజేశారు.


ప్రదర్శనలో పాల్గొన్న శునకాలు